క్లుప్తంగా

కావూరమ్మ ఆలయ ట్రస్టీగా జానకీదేవి నియామకం



చెరుకుపల్లి: చెరుకుపల్లి మండలం కావూరులో వేంచేసి యున్న శ్రీ కావూరమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టీగా ఎంపికైన నాగళ్ల జానకీదేవి సోమవారం ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో ఆలయ ట్రస్టీగా ఉన్న నాగళ్ల అమర్‌నాథ్ మృతి చెందటంతో ఆయన భార్య నాగళ్ల జానకీదేవిని దేవదాయ, ధర్మాదాయశాఖ ట్రస్టీగా నియమించింది. కార్యక్రమంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్లలో అఖిలేష్ యాదవ్ గెలుపు సంబరాలు



బాపట్ల: లోక్‌సభ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సమాజ్‌వాదీపార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఇండియా కూటమి బీజేపీని ఓడించి 43 స్థానాలు గెలుపొందటంతో స్థానిక నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేయటంతో పాటు ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ కూటమికి ఎదురొడ్డి నిలిచిన నాయకుడుగా అఖిలేష్ నిలిచిపోతారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విలియమ్ బూత్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ దాసరి శ్యామ్ లివింగ్‌స్టన్, కాండ్రు శరత్ కుమార్, మోర్ల చిన్న వెంకటేశ్వరరావు , మాజీ సైనిక సంక్షేమ సంఘ నాయకులు తోట దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ పూజల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



చావలి(వేమూరు): కనకదుర్గమ్మ మహిమ కలిగిన తల్లి అని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఊస రాజేష్ కనకదుర్గమ్మ తల్లి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, ఎంపీడీవో శేషగిరిరావు, కిషోర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం నేత శివన్నారాయణ సతీమణి మృతి

తెనాలి: సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ తోట శివన్నారాయణ సతీమణి శేషారత్నం (70) మృతి చెందారు. రూరల్ మండలం ఖాజీపేటలో పార్టీ అభిమానులు, బంధుమిత్రులు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు చేశారు. సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ దివంగత శివన్నారాయణ తెనాలి తాలూకా సీపీఎం పార్టీ, రైతు సంఘం నాయకులుగా ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. అందుకు శేషారత్నం తోడ్పడ్డారని గుర్తు చేశారు. వీరితో తోట వెంకయ్య, తిరుమలశెట్టి వెంకయ్య, తోట శ్రీనివాసరావు, అప్పారావు, భూలక్ష్మి, వెంకటరమణ, శివనాగేంద్రం, హనుమాయమ్మ తదితరులు శేషారత్నం భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆలయ హుండీ కానుకల లెక్కింపు

పొన్నూరు: పట్టణంలోని సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానం హుండీ కానుకలను సోమవారం లెక్కించిగా ఆదాయం రూ.10.76.960 వచ్చినట్లు ఆలయ ఈఓ టి.శ్రీనివాస్ తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్యామల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది 2 నెలల 15 రోజులకు సంబంధించి 20 హుండీలను లెక్కించినట్లు పేర్కొన్నారు.

మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడి రాజీనామా

పెదకాకాని: మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్ సోమవారం వైఎస్సార్ సీపీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేశారు. పెదకాకాని బాజీబాబా దర్గా వద్ద జాకీర్‌కు ఉన్న కూల్‌డ్రింక్స్ షాపు, టెంట్‌హౌస్ ఖాళీ చేయించాలని, లేని పక్షంలో పొక్లెయిన్‌తో పగులకొడతామని పలువురు టీడీపీ నాయకులు దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషాపై రెండు రోజులుగా వత్తిడి తెస్తున్నారు. సోమవారం షాపులు ఖాళీ చేయించాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జాకీర్ పార్టీ సభ్యత్వానికి, మండల కో ఆప్షన్ పదవికి రాజీనామా చేశారు. అలానే నంబూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులతో కలసి వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు దాసరి నాగేశ్వరరావు చింతలపూడిలోని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ సమక్షంలో పార్టీ కండువా వేయించుకున్నారు.

సీఎం ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయాలి

ద్వామా పీడీ రాజేష్



అధికారులకు సూచనలిస్తున్న ద్వామా పీడీ రాజేష్

వేమూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్టు అధికారి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఎంపీడీవోలు, తహసీల్దారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి నియోజకవర్గ స్థాయిలో నాలుగు ఆర్టీసీ బస్సులు కేటాయించడం జరిగిందన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాలకు లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని టీవీ లైవ్ ప్రసారం ద్వారా చూపించాలని సూచించారు. నియోజకవర్గ, మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి లైవ్ ప్రోగ్రాం వీక్షించటం ద్వారా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, ఏపీఎం శోభన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చిరస్మరణీయులు

బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో 96వ వర్ధంతి నిర్వహించిన అధికారులు



దుగ్గిరాల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, అధికారులు

బాపట్ల: స్వాతంత్రోద్యమంలో క్రియాశీల పాత్ర పోషించి, ఆంధ్రా గాంధీగా ఖ్యాతి కెక్కిన దుగ్గిరాల గోపాల కృష్ణయ్య భావితరాలకు స్ఫూర్తి దాయకమని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 96వ వర్ధంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి సోమవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని దుగ్గిరాల ప్రారంభించారని గుర్తు చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శిగా ఎంపికైన తొలి ఆంధ్రుడు దుగ్గిరాల కావటంతో పాటు రామదండును ప్రారంభించి ప్రజలను జాగృతం చేశారని పేర్కొన్నారు. చీరాల-పేరాల ప్రజలను 11 నెలల పాటు ఏకతాటిపై నడిపించారని చెప్పారు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో పని చేయడం స్ఫూర్తి దాయకమని బాపట్ల తహసీల్దార్ శ్రావణ్ కుమార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయి బాబు, డిప్యూటీ తహసీల్దార్ కే శ్రీదేవి, సిబ్బంది చిల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల చోరీ



పంటపొలాల్లో మోటారు దొంగిలించి పైపులు వదిలివేసిన దొంగలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి పెనుమాక పంటపొలాల్లో మోటారు దొంగలు రెచ్చిపోతున్నారు. తాజాగా సోమవారం తెల్లవారుజామున ఉండవల్లిలో నాలుగు ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్లు, రెండు చోట్ల సర్వీస్ వైర్లు దొంగిలించారు. రైతులు పంట పొలాలకు వెళ్లి చూడగా మోటార్లు విప్పదీసి తీసుకు వెళ్లిపోయినట్లు గుర్తించారు. కరెంటు స్తంభం నుంచి మోటారు వరకు ఉండే సర్వీస్ వైర్లను కూడా కట్ చేశారని, ఒక మోటారు కొనాలంటే రూ.15 వేల నుండి 20 వేలు ఖర్చు అవుతుందని, గత వారంలో రోజుల్లో మున్నంగి గోపిరెడ్డి పంట పొలంలో రెండుసార్లు మోటారు చోరీకి గురి కాగా, ఇలా అయితే వ్యవసాయం చేయడం కష్టమని రైతులు అంటున్నారు.

వైభవంగా లక్ష మోదక హోమం



నగరంపాలెం: శుద్ధ చవితి పురస్కరించుకుని కోట నాగరాజశర్మ అవధాని ఆధ్వర్యంలో సంపత్‌నగర్‌లోని హరి సన్నిధి ఆధ్యాత్మిక సేవా సంస్థలో సోమవారం లక్ష మోదక (కుడుములు) హోమం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గణపతి మూల మంత్రాలతో చతురావృత క్షీర తర్పణం కన్నుల పండువగా జరిపారు. అనంతరం హోమశాలలో విశేష ద్రవ్యాలు, మూల మంత్రాలతో గణపతి హోమం నిర్వహించారు. వేదక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజశర్మ మాట్లాడుతూ ప్రతి నెలా శుద్ధ చవితి నాడు మోదకాలతో గణపతి హోమం లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని పర్వదినాల్లో చండీ, రుద్ర, లక్ష్మీ హోమాలు కొనసాగుతాయని, భక్తులు హాజరై తీర్థప్రసాదాల స్వీకరించాలని ఆయన కోరారు.

నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు ఓటీ టేబుల్ బహూకరణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్ ఆపరేషన్ థియేటర్‌కు సోమవారం రూ. లక్ష విలువ గల ఓటీ టేబుల్‌ను శుశ్రుత అసోసియేట్ సంస్థ అధినేత మీసాల రమణ అందజేశారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ జాహ్నవి, డాక్టర్ వెంకటరెడ్డి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆషా సజని, గంగమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు ఎంపీపీ పిలుపు



ఎంఈవో హరిబాబును సత్కరిస్తున్న ఎంపీపీ విజయ నిర్మల, అధికారులు

నిజాంపట్నం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్యం వంటి కనీస మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. అధికారులు ఆయా గ్రామాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం త్వరలో పదవీ విరమణ చేయనున్న ఎంఈవో కొలసాని హరిబాబును ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, హరనాధబాబులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి హరనాధబాబు, నాజర్‌ఖాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సువర్చలా హనుమాన్ కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వైదికులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్లోని సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సువర్చలా ఆంజనేయ స్వామికి విశేష పంచామృతాభిషేకం, హనుమత్ గాయత్రీ హోమం, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు, సాయంత్రం శ్రీ సువర్చలా హనుమాన్ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథ శర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కల్యాణంలో గుడివాడ బాలకృష్ణ దంపతులు, రాధాశ్యామ్ దంపతులు పాల్గొన్నారు. వైదిక క్రతువును ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, వైఖానస పండితులు నాగమారుతి ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలకు చివరి రోజైన మంగళవారం పూర్ణాహుతి, ఊంజల్ సేవ ఉంటాయన్నారు. పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం, పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మడుపల్లి చంద్రశేఖర్, గుంటి వెంకట్, దమ్మాల వెంకటేశ్వరరావు, ఆర్ సురేష్, ఎం.వెంకటేష్, బి.లీలా ప్రసాద్, గోలి సోమశేఖర్, సభ్యులు పాల్గొన్నారు .

వీధి దీపాలన్నీ వెలిగేలా చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వీధి దీపాలన్నీ వెలిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు.వీధి దీపాలపై ప్రజల నుంచి అందే ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కరించడానికి ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆమె చెప్పారు. సోమవారం తన చాంబర్‌లో నగరంలో వీధి దీపాలు, తాగునీటి సరఫరా, అవుట్ ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనులు తదితర అంశాలపై ఎస్ఈ, ఈఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి దీపాల మరమ్మతులు, అవసరమైన మెటీరియల్ కోసం ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని చెప్పారు. ఎస్ఈ క్షేత్రస్థాయిలో పరిశీలించి తనకు నివేదిక పంపాలని ఆమె సూచించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కంప్లెయింట్ సెల్‌కు అందే ఫిర్యాదులు, వాటి వివరాలను ప్రతి రోజు తనకు ఇవ్వాలని ఆదేశించారు. నగరంలో ప్రతి రిజర్వాయర్‌ను నిర్దేశిత షెడ్యూల్ మేరకు శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరాలో కలుషిత నీటి సరఫరాపై అందే ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలని తెలిపారు. ఏఈల వారీగా ఎమినిటీ కార్యదర్శులు తాగునీటి సరఫరా సమయాల్లో శాంపిల్స్ తీసి వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభం అయినందున నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా ఏఈలు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలో ప్రధాన ఔట్ ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనుల్ని ఈఈలు నేరుగా పరిశీలించాలని చెప్పారు. పూడిక సంపూర్ణంగా తీయకపోతే రానున్న వర్షాలకు పొంగి సమస్యలు వస్తాయని తెలిపారు. పూడిక తీస్తున్న ప్రాంతాల్లో ముందు, తర్వాత ఫొటోలు గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. పూడిక తీసే ప్రాంతాల్లో ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ శ్యామ్ సుందర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంతో సాంకేతిక ప్రగతి

ప్రొఫెసర్ ఎస్.జిలాని




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జిలాని

గుంటూరు ఎడ్యుకేషన్: నూతన జాతీయ విద్యా విధానంతో విద్యా సంస్థలు సాంకేతికంగా బలోపేతం కావాలని హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వ విద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. జిలాని పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం నూతన విద్యా విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జిలాని విద్యాసంస్థల ప్రగతిని అంచనా వేసి, ప్రభుత్వ పరంగా గుర్తింపును ఇచ్చేటటువంటి నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ (ఎన్ఐఆర్ఎఫ్), నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ (నాక్)ను గురించి వివరించారు. సంబంధిత గుర్తింపు పొందడంలో అవసరమైన మౌలిక వసతులు, ప్రమాణాల గురించి చెప్పారు. ఎన్ఐఆర్ఎఫ్, నాక్ నుంచి గుర్తింపు పొందిన కళాశాలలు డీమ్డ్ యూనివర్సిటీలుగాను, తరువాత స్వయం ప్రతిపత్తిగల విద్యాసంస్థలుగా గుర్తింపు పొందేందుకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర ప్రమాణాల గురించి వివరించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ హిందూ ఫార్మసీ కళాశాల నాక్ గుర్తింపు పొందడానికి అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సదస్సుల్లో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, నాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ప్రత్యూష, ఓఎస్డీ డాక్టర్ పి. సీతారామయ్య, హిందూ కళాశాల పూర్వ వైస్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే పూర్తి నివారణ

ఆంకాలజిస్ట్ డాక్టర్ బైరపనేని స్రవంతి



మాట్లాడుతున్న క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ బైరపనేని స్రవంతి

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించేందుకు అత్యాధునిక వైద్య పరీక్షలు నేడు అందుబాటులో ఉన్నాయని ఆరియా క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్, లలితా హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ బైరపనేని స్రవంతి అన్నారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో నేషనల్ క్యాన్సర్ సర్వైవర్స్ మాసం సందర్భంగా (క్యాన్సర్ నుంచి కోలుకున్నవారి నెల) అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ దేశంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. తొమ్మిది మందిలో ఒకరు వారి జీవిత కాలంలో ఏదో ఒక రకమైన క్యాన్సర్ బారిన పడుతున్నట్లు వెల్లడించారు. ముందుగానే వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. కారణం లేకుండా బరువు తగ్గడం, శరీరంలో అసాధారణంగా వాపు, గడ్డలు ఏర్పడడం, రొమ్ములో గడ్డలు ఏర్పడడం, మానకుండా ఉండే దగ్గు, గొంతు బొంగురుపోవడం, పుండ్లు మానకపోవడం, అధిక రక్తస్రావం, మూత్రం, మలంలో రక్తం పోవడం తదితర లక్షణాలు ఉంటే క్యాన్సర్‌గా భావించి తక్షణమే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. హీమో, టార్గెటెడ్, ఇమ్యూనో, హార్మోన్, రేడియేషన్ థెరపీలతో పాటు ప్రెసిషన్ మెడిసిన్, ఆంకో సర్జరీ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం డిజిటల్ మెమోగ్రామ్, హోల్‌బాడీ సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్, ఎండోస్కోపి, బ్రాంకో స్కోపి, బయాప్సీ, బయోమార్కర్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, నావిగేషన్ గైడెడ్ ప్రొసీజర్లతో పాటు అన్ని రకాల నిర్ధారణ సౌకర్యాలు తమ ఆసుపత్రిలో ఉన్నాయని తెలిపారు.

వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి..!

- గడువు దాటితే ముప్పు తప్పదు
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచన



సిలెండర్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీ(ఏ-29)



గ్యాస్ సిలెండర్‌లు సరఫరా చేస్తున్న ఆటో

పెదకాకాని: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతిలో సరైన జాగ్రత్తలు పాటించక పోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండరు కాలపరిమితి ఉంటుందని, దానిని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్ను వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండరును బుకింగ్ చేసుకుని మార్చే ప్రతిసారి ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించాలి.

సిలెండర్‌పై గడువు తేదీని ఇలా గుర్తించాలి..

ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఏ-24, బీ-24 అని ఉంటే.. ఆ సిలిండర్ 2024 మార్చికి ఆ సిలెండర్ గడువు ముగుస్తుందని అర్థం. 24 అంటే 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుండి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకూ, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబరు వరకూ, డి అక్షరం అక్టోబరు నుండి డిసెంబరు వరకూ అని గుర్తించాల్సి ఉంటుంది.

వినియోగదారుడి హక్కులు

గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కొన్ని హక్కులు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు. కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అలా కోరినప్పటికీ డీలర్ వద్దనే స్టవ్ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు. గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల వరకూ వినియోగదారులకు ఉచితంగా సిలెండర్ డోర్ డెలివరీ చేయాలి. సిలెండర్ ఇంటికి తెచ్చే బాయికి ఎటువంటి నగదు అదనంగా ఇవ్వాల్సిన పని లేదు. సిలెండర్ వాషర్ దెబ్బతిని గ్యాస్ లీకు అవుతున్నా గ్యాస్ ఏజెన్సీ వారికి సమాచారం అందిస్తే ఉచితంగా సర్వీసు చేయాల్సి ఉంది.

ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దు:

సిలెండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని, గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండరు అడిగి తీసుకునే హక్కు వినియోగదారుడికి ఉంది.

సిలిండరు పదేళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలెండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న సిలిండర్‌పై కోడ్ విధానంలో ఉన్న తరువాతే సిలిండర్ మార్కెట్లోకి వస్తుంది.

ఉద్యోగులకు అండగా నిలవండి

ఎమ్మెల్యే మనోహర్‌ను కలిసిన ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు

తెనాలిఅర్బన్: తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌ను ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు సోమవారం బోసురోడ్డులోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులకు అండగా ఉండాలని మనోహర్‌ను కోరారు. ఆయన వెంట నాయకులు నన్నపనేని భాస్కరరావు, మేమవరపు శివకుమార్, ప్రకాష్, లక్ష్మణ్, ఎస్‌కేవీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదినం

తెనాలిరూరల్: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినాన్ని ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అయితానగర్ లోని లింగారావు సెంటర్ వద్ద బాలకృష్ణ జన్మదినం సందర్భంగా టీడీపీ రాష్ట్ర నాయకుడు ఈదర వెంకట పూర్ణచంద్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రైతు నాయకుడు ఈదర పూర్ణ చందు, కనిగంటి మురళి, సత్యనారాయణ, ఉపేంద్ర, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి సరోజబాబు, జాస్తి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అలసత్వం వద్దు

మున్సిపల్ కమిషనర్ శేషన్న



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: చెత్తను సకాలంలో సేకరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 27వ వార్డులో సోమవారం ఉదయం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. డోర్ టు డోర్ కలెక్షన్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. చెత్త సేకరణలో ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.